క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారైంది. సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 30వ తేదీ నుంచి 11 రోజులపాటు బ్రహ్మోత్సవాలు జరిపేందుకు తీర్మానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ వాసగిరి సాయికృష్ణమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, జయరామిరెడ్డి, గొల్ల వెంకటేశ్వర్లు, రైతు సంఘం సెక్రటరీ శంకర్‌రెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించిన దృశ్యం

డోన్ : వేసవి నేపథ్యంలో పట్టణ ప్రజల సౌకర్యార్థం స్థానిక వాల్మీకి సర్కిల్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్రికె హరికిషన్, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్‌రెడ్డి ప్రారంభించారు. రెండు నెలల పాటు నిరంతరం మజ్జిగ పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో శుభం విల్లా హోం డెవలప్పర్స్ అధినేత కొంగటి ప్రశాంత్, ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు చంద్రశేఖర్, అర్జున్‌రెడ్డి యూత్ సురేష్, ఆలా రవి తదితరులు పాల్గొన్నారు.

26న ప్రచార భేరీ ముగింపు సభ

బేతంచెర్ల: పట్టణంలోని పాత బస్టాండులో ఈనెల 26వ తేదీన జరిగే ప్రచార భేరీ పాద యాత్ర ముగింపు సభకు కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున్న తరలివచ్చి జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు ఎల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని గోర్లగుట్ట, ఆర్‌ఎస్ రంగాపురం గ్రామాల్లో ప్రచార భేరీ పాద యాత్ర నిర్వహించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



మృత దేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో కొన్నేళ్లుగా జీవనం కొనసాగిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి (40) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. బేతంచెర్ల పోలీసులు, ఆలయ కమిటీ సభ్యులు ఆనల్లురు వ్యవస్థాపకుడు వన్నూర్ బాషాకు అంత్యక్రియలు నిర్వహించాలని కోరారు. స్పందించిన ఆ నల్లురు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు నాగేశ్వర్ రెడ్డి, రాఘవేంద్ర, యూసుఫ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతి

బేతంచెర్ల: పట్టణంలోని వడ్డెపేట కాలనీకి చెందిన ఎల్బండ ఎల్లస్వామి (63) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ యూనియన్ అధ్యక్షుడు సూర్య చంద్రా రెడ్డి, ప్రతినిధులు అహ్మద్ హుసేన్, అబీబ్ బాషా తదితరులు భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. మృతునికి భార్య లక్ష్మీదేవితో పాటు, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

బీమా నగదు అందజేత



సభ్యులకు నగదు అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: పట్టణంలోని ఖాజీవాడకు చెందిన షేక్ జాఫర్(58) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు సోమవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10వేలను వెల్ఫేర్ అసిస్టెంట్ రవి, సచివాలయ కార్యదర్శి సుబ్బయ్య, వార్డు సభ్యులు సురేష్ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. త్వరలోనే మరో రూ.90వేలు మంజూరు అవుతుందని వెల్ఫేర్ అసిస్టెంట్ రవి తెలిపారు.

సింగిల్ విండో చైర్మన్‌కు సన్మానం

డోన్ టౌన్: ఇటీవల డోన్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తిరుణాంపల్లె తిరుమల రెడ్డిని వెలుగు పథకం సిబ్బంది ఘనంగా సత్కరించారు. స్థానిక జాడీల ఫ్యాక్టరీ ఆవరణలోని వైఎస్సార్ క్రాంతి(వెలుగు)కార్యాలయంలో సోమవారం ఎంపీఎం రామాంజనేయులు ఆధ్వర్యంలో సీసీలు తిరుమల రెడ్డికి శాలువా కప్పి పూల మాలలతో సన్మానించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన అమోఘం

- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజాస్పందనే ప్రత్యక్ష సాక్ష్యం
- రాష్ట్రంలో బనగానపల్లె నియోజకవర్గానికి మూడవస్థానం
- అందరి సహకారం అభినందనీయం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన అమోఘమని, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి లభించిన ప్రజాస్పందనే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 15వేల సచివాయాల్లో ఏడు లక్షల మంది గృహసారథులు, కన్వీనర్లు సచివాలయ మండల కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల అభిప్రాయాలను సేకరించారని, సీఎం జగన్ పాలనకు మద్దతుగా 79లక్షలకుపైగా ప్రజలు తమ సెల్‌తో మద్దతు తెలిపారని గుర్తు చేశారు. ప్రత్యేకించి రాష్ట్రంలో బనగానపల్లె నియోజకవర్గానికి మూడవస్థానం లభించడం శుభపరిణామమని, 49వేల మంది నుంచి మిస్డ్‌కాల్స్ వచ్చాయని, అందరి సహకారం అభినందనీయమన్నారు. ఈ మేరకు స్థానిక స్వగృహంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ నెల 7 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం 15 రోజులపాటు కొనసాగిందన్నారు. వంద శాతం పూర్తి చేసేందుకు 29వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. గృహసారథులు, కన్వీనర్లు సచివాలయ మండల కన్వీనర్లు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వలంటీర్లు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని అంకితభావంతో నిర్వహిస్తున్నారని, ప్రతి ఇంటినీ సందర్శించి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు సేకరిస్తున్నారన్నారు. నవరత్నాల హామీలను 98శాతం సీఎం జగనన్న నాయకత్వంలో పూర్తి చేయడం జరిగిందని, అదే స్థాయిలో ప్రజలు కూడా మద్దతు తెలుపుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ మెగా సర్వే సత్ఫలితాన్నిచ్చిందని, క్షేత్రస్థాయి పర్యటనల తరువాత రాష్ట్ర ప్రజలు తమ పిల్లల భవిష్యత్తు కోసం విశ్వసించే ఏకైక వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అని రాష్ట్ర ప్రజల్లో విశ్వాసం నెలకొందన్నారు. సీఎం జగన్ అమలు పరుస్తున్న సుమారు 32 పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న అక్క చెల్లెమ్మలు ప్రజల్లోను ఆనందం వెల్లివిరుస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల వద్దకే ప్రజాప్రతినిధులను పంపిన ఏకైక సీఎం జగనన్న అని, 2024 ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ తప్పకవిజయం సాధిస్తామని పేర్కొన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో జగనన్నే మాభవిషత్యు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజలతోపాటు ప్రతిఒక్కరికీ ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబుల రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లాశ్రీలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా విఘ్నేశ్వరరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్లు గుండం నాగేశ్వరరెడ్డి, రాజా, మధు, సుబ్రహ్మణ్యం, సుధాకర్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు జాహెద్ ప్రసంగించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, బీంరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, నాగార్జునరెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె: సీఎం వైఎస్ జగన్‌పాలనలో పార్టీలు, కులలుమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు లభిస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మీరాపురం గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు మీరాపురం గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. సర్పంచ్ తలారినాగేశ్వమ్మ, ఎంపీటీసీ మారంలక్ష్మీదేవి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు యాగంటి ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, మనోహర్‌రెడ్డి మల్లేశ్వరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. గడప గడపకూ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ అర్హులై ఉండి సంక్షేమ పథకాలు లభించనివారు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల వద్దకే పాలన లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి నేరుగా ప్రభుత్వ ఫలాలు అందజేస్తున్నారని చెప్పారు. జగనన్న పాలనలో బీసీ ఎస్సీ,ఎస్టీ మైనార్టీలు సంతోషంగా ఆత్మగౌరవంతో జీవిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, మండల ఏఈ రమణ, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు సీతారామ్‌రెడ్డి, హుస్సేన్‌సా, సుబాన్, బసప్ప, రామచంద్రారెడ్డి, పల్లె మదర్‌సా, రమణారెడ్డి, ఆర్‌నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని కైప గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంచినీరు పట్టుకునే విషయంలో జరిగిన ఘర్షణకు సంబంధించి రెండువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన కలుగొట్ల జయరాముడు, రామమద్దిలేటి, రామేశ్వరి, సావిత్రి మరో వర్గానికి చెందిన తగరపు ఈశ్వరయ్య, కొలిమి ఆశీర్వాదం, తగరపు శ్యామల, కమ్మిగారి అంకన్న ఘర్షణ పడుతుండడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎర్రగుడి గ్రామంలో.. నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని రామక్రిష్టాపురం గ్రామంలో ఎర్రగుడి భాగ్యాలు అనే మహిళను ఇదే గ్రామానికి చెందిన వడ్డే నాగేష్, అతని కుమారుడు పరమేష్, హరి దాడి చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. బాధిత మహిళను పొదుపు గ్రూపునకు సంబంధించిన డబ్బుల విషయంలో వడ్డే నాగేష్ తన ఇంటికి పిలిపించుకొని దాడికి పాల్పడినట్లు బాధితురాలి ఫిర్యాదులో పేర్కొందన్నారు. ఈ మేరకు వడ్డేనాగేష్ అతని కుమారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం



పానకం పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలోని కంభాలపాడు సర్కిల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద వాల్మీకి సంఘం నాయకులు సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. మొదటి రోజు పానకం పంపిణీ చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలరు రమణ, పూల శ్రీను, టెంకాయల కేశవయ్య, డీలర్ కృష్ణ, తిరుపాలు, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫోర్‌లైన్స్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



జేసీబీకి పూజలు చేస్తున్న కాటసాని తిరుపాల్‌రెడ్డి

బనగానపల్లెరూరల్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి జీఎం టాకీస్ వరకు రూ.8 కొట్ల నిధులతో చేపట్టిన ఫోర్‌లైన్స్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి నాల్గవ ప్యాకేజీ పనులను సోమవారం ఆర్‌అండ్‌బీ డీఈఈ సునీల్‌రెడ్డి, ఏఈ హుస్సేన్‌లతో కలిసి ఎమ్మెల్యే కాటసానిరామిరెడ్డి సోదరుడు, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో ఇప్పటికే ఆర్టీసీ బస్టాండ్ నుంచి పెట్రోల్ బంకు వరకు రూ.4 కోట్లతో నిర్మాణ పనులు పూర్తి చేయడం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, కాంట్రాక్టర్ కాటసాని రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో వెలసిన శ్రీ పాలికి వర చిదంబర స్వామి ఆరాధనోత్సవాలు సోమవారం ముగిశాయి. స్వామి వారిని ప్రత్యేకంగా ఆలంకరించి రుద్రాభిషేకం, గురుపూజ, మంగళ హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కర్నూలుకు చెందిన ఆనంద వెంకటేశ్వర్లుచే నిర్వహించిన తత్సంగం భక్తులను అలరించింది. భక్తులకు అన్నదానం చేశారు.

ఇరు వర్గాల ఘర్షణ

కోవెలకుంట్ల: మండలంలోని బిజనవేముల గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. సోమవారం ఎస్‌ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన రాంభద్రుడు, రమేష్, మరో మహిళ, మరో వర్గానికి చెందిన చిన్న మద్దిలేటి, పెద్దమద్దిలేటి, మనోహర్ అనే వ్యక్తులు పొలంలో బర్రెలు పడి పంటను ధ్వంసం చేశాయన్న నేపంతో గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ మేరకు రెండు వర్గాలకు చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

శ్రీశివపార్వతులకు పల్లకీ సేవ

బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పల్లకీ సేవ సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తొటబుచ్చిరెడ్డిల ఆధ్వరంలో ఏకశిలారూపంలో కొలువైన శ్రీశివపార్వతులకు అభిషేకం తదితర పూజలు జరిగాయి.

అందరూ కలిసి కట్టుగా శ్రమించాలి



మాట్లాడుతున్న కాటసాని ఓబులరెడ్డి

అవుకు: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు కలసి కట్టుగా శ్రమించి పీపుల్ సర్వేను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు వైఎస్సార్‌సీపీ యువనేత కాటసాని ఓబులరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం అవుకు మండల జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డిలతో కలిసి కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో కాటసాని మాట్లాడారు. ఈ నెల 29వరకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరుగుతుందని, ప్రతి గడపకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, వారికి పథకాలు సరిగా అందాయోలేదో తెలుసుకోవాలన్నారు. ప్రజల అభిప్రాయాలను సేకరించాలని, లబ్ధిదారుల అనుమతితో వారి సెల్ ఫోన్ నుంచి 82960 82960 నంబరుకు మిస్‌డ్ కాల్ ఇవ్వాలని సూచించారు.

శాస్త్రీయ దృక్పథంతో మెలగాలి

డోన్ టౌన్ : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో మెలగాలి అని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు సూచించారు. పట్టణంలోని షాదిఖానాలో సోమవారం జరిగిన సంఘం జిల్లా మూడవ మహా సభలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. నేటితరం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం మసక భారుతుందని, మూఢత్వాన్ని, భావవాదాన్ని బలంగా నమ్ముతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, సీఐటీయూ పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్టు

డోన్ టౌన్: నాటు సారా విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసి ఒక్కొరి నుంచి 5లీటర్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ సోమవారం తెలిపారు. దేవరబండ గ్రామానికి చెందిన ఎరుకలి వెంకట్రాముడు, నక్కలవాగుపల్లె గ్రామానికి చెందిన బాలమద్దయ్య కొత్తకోట క్రాస్‌వద్ద, తాటిమాను కొత్తూరుకు చెందిన ఎరుకల శ్రీరాములు, చింతలపేటకు చెందిన రమేష్ చింతలపేట సమీపంలో సారా విక్రయిస్తున్న సమాచారం మేరకు దాడులు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'ధర్మవరం సుబ్బారెడ్డి అభ్యర్థిత్వాన్ని అంగీకరించం'

డోన్: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఆస్తులు అమ్ముకొని ప్రాణత్యాగాలను చేసిన వారిని కలుపుకుని పోకుండా ఒంటెద్దుపోకడలతో వ్యవహరిస్తూ టీడీపీని భూస్థాపితం చేసేందుకు కంకణం కట్టుకున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి అభ్యర్థిత్వాన్ని తాము అంగీకరించమని మాజీ మంత్రి, టీడీపీ అసమ్మతి నేత కేఈ ప్రభాకర్ వర్గీయులు స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా పార్టీకి నష్టం చేకూర్చుతున్న ధర్మవరం సుబ్బారెడ్డిని వెంటనే పార్టీ నుంచి బహిష్కరించాలని టీడీపీ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మధు ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డోన్, ప్యాపిలి మాజీ ఎంపీపీలు శేషఫణిగౌడ్, తొప్పెల శ్రీనివాసులు, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు కొత్రికె ఫణి రాజ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కేశన్నగౌడ్, పార్టీ మాజీ అధికార ప్రతినిధి చంద్రపల్లె ఆచారి మాట్లాడారు. ధర్మవరం సుబ్బారెడ్డి కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీలో ఉన్నప్పుడు టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధించిన విషయాన్ని తాము ఇప్పటికీ మరిచిపోలేదన్నారు. ఒక పద్ధతి ప్రకారం టీడీపీలోని కేఈ, కోట్ల వర్గాలను రాజకీయంగా కనుమరుగు చేయాలనే లక్ష్యంతో సుబ్బారెడ్డి పనిచేస్తున్నారనే విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. అడ్డదారిలో 20 ఏళ్లు రాజకీయాలు నడిపి అక్రమ వ్యాపారాలు చేసి కోట్లు గడించిన ధర్మవరం సుబ్బారెడ్డి సొంత గ్రామమైన ధర్మవరంలో ఏనాడైనా సర్పంచుగా గెలిచారా అని వారు ప్రశ్నించారు. భూకబ్జాదారులు, హంతకులను వెంట పెట్టుకొని అప్పుడే ఎమ్మెల్యే అయినట్లు పగటి కలలు కంటున్న ధర్మవరం సుబ్బారెడ్డి నిజస్వరూపం ప్రజలందరికీ తెలుసునన్నారు. పార్టీ డోన్ మండల శాఖ అధ్యక్షునితోపాటు ప్యాపిలి మండలానికి చెందిన తెలుగుయువత నాయకులు భూకబ్జాలకు పాల్పడి అరెస్టయినా పార్టీ నుండి ఎందుకు సస్పెండ్ చేయలేదని వారు ప్రశ్నించారు.

ప్రతి అంశాన్ని నమోదు చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభాకర్

డోన్ టౌన్: తమ పరిధిలోని పాఠశాలల పురోగతిపై నిర్వహించే సామాజిక తనిఖీల్లో ప్రతి అంశాన్ని ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని ఎంఈఓ ప్రభాకర్ సూచించారు. స్థానిక పాతపేట జెడ్పీ హైస్కూల్లో సోమవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూల్స్, గురుకుల, కేజీబీవీ, మోడల్ స్కూల్ హెచ్‌ఎంలకు సామాజిక తనిఖీ విషయాలపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక యాప్‌లో పాఠశాల్లో మౌళిక వసతుల కల్పన విభాగంలో విద్యార్థుల అకడమిక్ ఫర్‌పార్మెన్స్, సహపాఠ్య కార్యకలాపాలు, విద్యార్థుల ఆసక్తి, జాగ్రత్తలు, ఉపాధ్యాయుల పని తీరు తదితర అంశాలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ విషయాలను హెచ్‌ఎంలు పేరెంట్స్ కమిటీ సభ్యులకు వివరించాలని, వారి ఆధ్వర్యంలో సామాజిక తనిఖీలు చేపట్టాలని సూచించారు.

మా భవిష్యత్తు నువ్వే జగనన్న కార్యక్రమానికి విశేష స్పందన

- వైఎస్సార్‌సీపీ డోన్ నియోజకవర్గ పరిశీలకులు కోనా మురళీధర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కోనా మురళీధర్‌రెడ్డి

డోన్ : మా భవిష్యత్తు నువ్వే జగనన్న, మా నమ్మకం నువ్వే జగనన్న అనే కార్యక్రమానికి విశేష ప్రజాధరణ లభించిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోనా మురళీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో సోమవారం నిర్వహించిన సచివాలయ, గృహ సారథుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి ఎంపిపి రేగటి రాజశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్, గృహసారథులు, ప్యాపిలి, బేతంచెర్ల, డోన్ మండలాల కన్వీనర్లు బోరా మల్లికార్జునరెడ్డి, బాలేశ్వరరెడ్డి, మల్లెంపల్లె రామచంద్రుడు, పట్టణ కన్వీనర్ కురుకుందు హరి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గృహసారథులు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న అభివృద్ధి పనుల గురించి ఇంటింటికి వెళ్లి వివరించడం, మిస్సుడ్‌కాల్ ద్వారా సీఎం సందేశాన్ని వినిపించడం జరిగిందన్నారు. ఎక్కడైనా కార్యక్రమం పెండింగ్ ఉన్నట్లయితే వీలైనంత త్వరగా ప్రతిఒక్కరూ సమన్వయంతో పీపుల్స్ సర్వేను పూర్తిచేయాలన్నారు. ప్రతి కార్యకర్త పార్టీని విజయపథంలో నడిపించేందుకు చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, నాగేంద్ర, ఆర్ట్ రమణ, కుళ్లాయి, సుంకయ్య, పాలుట్ల రఘురాం, మేకల రాజు, కాలేషా, పెద్దయ్య పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి



ఎంపీపీ నాగభూషణం రెడ్డి సత్కరిస్తున్న



పంచాయతీరాజ్ కమిషనర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న వెంకటరమణ

డోన్ టౌన్ : గ్రామ స్వరాజ్యమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం పాలన సాగిస్తున్నారని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఉద్యోగులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణప్రాంత ప్రజల జీవనాధారం అయిన వ్యవసాయ రంగం అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. అలాగే మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్ నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. కేవలం ఎనిమిది నెలల్లో మండలంలోని వివిధ గ్రామాల్లో తాగు నీటి కోసం 26ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించిన ఘనత మన ప్రభుత్వందే అన్నారు. అనంతరం గ్రామ పంచాయితీల్లో ప్రభుత్వం నిర్దేశించిన 9 అంశాల్లో ప్రగతి సాధించిన యు.కొత్తపల్లె, కన్నపకుంట, ఉడుములపాడు, చిన్నమల్కాపురం, కొత్తకోట, ఉంగరానిగుండ్ల, సోంపురం, కొచ్చెర్వు గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఇందుకు సహకరించిన సచివాలయం సిబ్బందిని శాలువ, ప్రసంసా పత్రాలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ తిరుణాంపల్లె తిరుమల రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈవోఆర్డీ వరప్రసద్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి సుపరిపాలన అందిస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వెంగన్న, ఈఓఆర్డీ వెంకట రంగనాయకులు, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయాలతో పాలనలో వినూత్న మార్పులతో పాటు ప్రజల సమస్యలు గ్రామ స్థాయిలోనే పరిష్కారం అవుతున్నాయన్నారు. 1973 భారత రాజ్యాంగం అధికరణ బిల్లు ద్వారా మన రాష్ట్రంలో 1994 మూడంచల వ్యవస్థ అందుబాటులోకి వచ్చి, 1995లో గ్రామ, మండల స్థాయి, జిల్లా పరిషత్‌లు ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటైనట్లు తెలిపారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు మండలస్థాయి ఉత్తమ పంచాయతీ పురస్కారాలను అందజేశారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డిని దుశ్శాలువ, పూలమాళలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంగస్వామి, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, శ్రీరాములు, రాజు, మద్దమ్మ, యుగంధర్ రెడ్డి,లక్ష్మీదేవి, ఎంపీటీసీలు మునేశ్వర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, వైఎస్సార్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామ పంచాయతీ సర్పంచ్‌కు సన్మానం

బనగానపల్లెరూరల్: మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామ పంచాయతీ రాష్ట్రస్థాయి ఉత్తమ పంచాయతీగా (నీటీలభ్యత, సంరక్షణ విభాగంలో) ఎంపికైంది. ఈ మేరకు విజయవాడలోని పంచాయతీరాజ్ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సర్పంచ్ జి.వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి శంకర్‌నాయక్‌ను సన్మానించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి చేతుల మీదుగా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిలను సన్మానించి ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారు.

డోన్ టౌన్: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురష్కరించుకొని సోమవారం మండలంలోని పలు గ్రామాల సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలకు సర్పంచ్‌లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మగాంధీజీ, రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామల అభివృద్ధికి ప్రజలు తగిన సూచనలు, సలహాలు ఇచ్చి అభివృద్ధికి సహకరించాలని కోరారు. సోంపురం పంచాయితీలో నిర్వహించిన గ్రామ సభకు ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు,ఈవోఆర్డీ వర ప్రసాద్, సర్పంచ్ రాధమ్మ హాజరయ్యారు.

సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలి

ప్యాపిలి: స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారంలో గ్రామ పంచాయతీలు చొరవ చూపాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు తమ పరిధిలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామ సభలు నిర్వహించి గ్రామంలో చేపట్టాల్సి ఉన్న అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ బాల కృష్ణుడు, పంచాయతీ సెక్రెటరి శివకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ సుబ్బరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. ఎస్డీజీ సర్వేలో తొమ్మిది అంశాల్లో ప్రతిభ చూపిన గ్రామ పంచాయతీలకు అవార్డులు అందజేశారు. ప్రజలకు మౌళిక వసతులు కల్పించి పంచాయితీల అభివృద్ధికి సర్పంచ్‌లు కృషి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ తాహీర్ హుసేన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.